సాక్షి అనంతపురం

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



చూడ'చెక్క'ని సంకల్పం

చెక్క ముక్క, టెంకాయ చిప్ప, మట్ట.. వంటి వాటితో చూడచక్కని కళాకృతులు తయారు చేసి ఔరా అనిపిస్తున్నారు ఎయిర్‌ఫోర్సు మాజీ ఉద్యోగి లక్ష్మీనారాయణ. IIలో

గరిష్టం/కనిష్టం
35.7°/ 20.2°

జిల్లా అంతటా సోమవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

విజయవంతంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు



సీడీ ఆస్పత్రిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు విజయవంతంగ సాగుతున్నాయి. ప్రజలు శిబిరాలకు వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. సోమవారం జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా 2,587 మంది ఓపీ సేవలు పొందారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న347 మందిని స్పెషలిస్టు వైద్యులు గుర్తించి జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి నగరంలోని పాతూరు సీడీ ఆస్పత్రి, బుక్కరాయసముద్రం దండువారిపల్లి వైద్య శిబిరాలను పరిశీలించారు.

3న మినీ జాబ్ మేళా



అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ మూడో తేదీన అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. బీ- న్యూ , డీ-మార్ట్, స్విగ్గి, జెప్టో కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు www.apssdc.in లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 8317520929 నంబరులో సంప్రదించాలన్నారు.

మోసగాడిని త్వరలోనే పట్టుకుంటాం

ఉరవకొండ: సబ్సిడీ రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పి మోసగించిన వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. సోమవారం ఉరవకొండ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. స్థానిక మార్కండేయస్వామి ఆలయం ఎదురుగా నివాసముంటున్న శేఖర్‌బాబు అనే వ్యక్తి సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని పట్టణంలోని చిరువ్యాపారుల నుంచి రూ.20 లక్షల దాకా వసూలు చేశాడని, రెండో తేదీ నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని చెప్పారు. ఈ నెల 20న షెహనాజ్ అనే బాధితురాలి ఫిర్యాదు మేరకు శేఖర్‌బాబుపై కేసు నమోదు చేశామన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సురక్ష, రెవెన్యూ, రీసర్వే, గడపగడపకూ మన ప్రభుత్వం పనులు, హౌసింగ్, ఉపాధి హామీ తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి డివిజన్, మండలస్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కింద 2,888 పనులు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 2,793 పనులు గ్రౌండింగ్ అయ్యాయని, మిగిలినవి వెంటనే మొదలవ్వాలని సూచించారు. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద కింద వారం రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో ఈ నెల 24 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

జీజీహెచ్‌లో డెంగీ పరీక్షలు



అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి(జీజీహెచ్)లో డెంగీ నిర్ధారణకు అవసరమైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ వన్ యాంటీజెన్, ఐజీజీ, ఐజీఎం టెస్టులు, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలిపే పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చామంతి తోటలో పనులు చేస్తున్న కూలీలు



చామంతి మొక్కలకు వెలుతురు కోసం ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ బల్బులు

వెలుగు జిలుగుల చామంతి

చామంతి పూలకు మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. తెలుపు, పసుపు, ఎరుపు, నీలి తదితర రంగుల్లో లభించే చామంతి వినియోగదారులను ఆకర్షిస్తోంది. సిరులు కురిపించే ఈ పంటను చాలామంది రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పగలు తక్కువ.. రాత్రి ఎక్కువగా ఉంటోంది. చామంతి మొక్క ఎదుగుదలకు వెలుతురు అవసరం. ఈ సమస్యను అధిగమించడానికి పుట్లూరు మండలం ఎ.కొండాపురంలో రైతు నారాయణస్వామి వినూత్నంగా ఆలోచించి చీకటి సమయాన ఎల్‌ఈడీ బల్బులతో వెలుగులు ప్రసరింపజేస్తున్నాడు. మొక్కలు త్వరితగతిన ఎదగడంతో పాటు ప్రకాశవంతమైన పూల దిగుబడి రావడానికి ఎల్‌ఈడీ బల్బులు ఉపయోగపడతాయని అంటున్నాడు. బల్బుల ఏర్పాటుకు ఎకరాకు రూ.70 వేల దాకా ఖర్చవుతోందని రైతు తెలిపాడు.

– డి.మహబూబ్‌బాషా, సాక్షి ఫొటోగ్రాఫర్



ఎ.కొండాపురం వద్ద చామంతి మొక్కలకు ఎల్‌ఈడీ వెలుగులు

జంట మురిసె.. విద్య విరిసె..

- కల్యాణమస్తు, షాదీ తోఫాతో బడుగులకు చేయూత
- వధూవరులు పదో తరగతి పాసైతేనే అర్హత
- ప్రతి త్రైమాసికానికీ లబ్ధిదారుల ఎంపిక
- ఈసారి 836 మందికి రూ.6.49 కోట్ల లబ్ధి
- ఓ వైపు కల్యాణం.. మరో వైపు విద్యకు సాయం

బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లికి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తోంది. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు చదువును ప్రోత్సహించడం, డ్రాపౌట్స్ తగ్గించి అక్షరాస్యత శాతాన్ని పెంచడమే లక్ష్యంగా వధూవరులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధన విధించింది.



అనంతపురం: పేదింటి ఆడబిడ్డల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం జంట ప్రయోజనం కలిగే కానుక అందిస్తోంది. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద ఆర్థిక సాయం కోరుతూ ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను మూడు నెలలకోసారి పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పిల్లలు తమ జీవిత భాగస్వామిగా తమ కులానికి చెందిన వారిని ఎంచుకుంటే నిర్దేశిత మొత్తం, ఇతర కులాలకు చెందిన వారిని ఎంపిక చేసుకుంటే అంతకంటే అధిక పారితోషికం అందిస్తుంది. దివ్యాంగులకు సంబంధించి ఇద్దరూ వైకల్యం ఉన్న వారైనా, ఒక్కరే వైకల్యం ఉన్న వారైనా సరే ఆడపిల్లకు మాత్రమే నగదు ప్రోత్సాహం అందుతుంది. భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకూ ఈ పథకం కింద లబ్ధి చేకూరుస్తారు. ప్రస్తుత త్రైమాసికానికి సంబంధించి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద 836 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. వీరికి నవంబరు మొదటి వారంలో రూ.6.49 కోట్ల ఆర్థికసాయం అందనుంది.

అర్హతలివీ...

వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద దరఖాస్తు చేసుకునేవారికి ప్రభుత్వం కొన్ని అర్హతలు నిర్దేశించింది. బాల్య వివాహాలకు చెక్ పెట్టేందు కోసం దరఖాస్తు చేసుకున్న వధువుకు పెళ్లి నాటికి 18 ఏళ్లు, వరుడికి 21 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. విద్యను ప్రోత్సహించడంలో భాగంగా వధూవరులు కచ్చితంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన పెట్టింది. గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల నెలసరి ఆదాయం కలిగిన వారు అర్హులు. మూడు ఎకరాల్లోపు మాగాణి, పదెకరాల మెట్ట, మాగాణి మెట్ట కలిపి 10 ఎకరాలు ఉన్న వారు అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లకు చెందిన కుటుంబాలకు ఇది వర్తించదు. పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు మినహాయింపు ఉంటుంది. సొంతంగా నాలుగు చక్రాల వాహనం ఉంటే ఈ పథకానికి అనర్హులు. ట్యాక్సీలు, ఆటోలు, ట్రాక్టర్లున్న వారికి మినహాయింపు ఇచ్చారు. విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లలోపు ఉండాలి. లబ్ధి పొందాలనుకునే కుటుంబంలో ఏ ఒక్కరూ ఆదాయ పన్ను చెల్లించి ఉండకూడదు. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి ఇల్లు కలిగి ఉండరాదు.

రెట్టింపు ప్రోత్సాహకాలు..

వివక్ష, లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా పథకాల అమలులో సచివాలయాలు- వలంటీర్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. గత ప్రభుత్వం అమలు చేసిన దాని కన్నా దాదాపు రెట్టింపు ప్రోత్సాహాలు ప్రస్తుత పథకాల ద్వారా అందుతున్నాయి.

- నాడు ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు అమలు చేసింది. ప్రస్తుత జగన్ సర్కారు లక్ష రూపాయలు ఇస్తోంది.
- ఎస్సీ, ఎస్టీల్లో కులాంతర వివాహాలకు నాడు రూ.75 వేలు ఇస్తే, నేడు రూ.1.20 లక్షలు ఇస్తున్నారు.
- బీసీలకు నాడు రూ.30 వేలిస్తే, నేడు రూ.50 వేలు, బీసీ కులాంతర వివాహాలకు రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచి అందిస్తున్నారు.
- మైనార్టీలకు గతంలో రూ.50 వేలు ఇస్తే.. తాజాగా రూ.లక్ష అందజేస్తున్నారు.
- విభిన్న ప్రతిభావంతులకు గత ప్రభుత్వం రూ.లక్ష ప్రకటిస్తే.. ఈ ప్రభుత్వంలో రూ.1.50 లక్షలు ఇస్తున్నారు.
- భవన నిర్మాణ రంగ కార్మికులకు గత సర్కారు రూ.20 వేలు ఇస్తే.. ఈ ప్రభుత్వంలో రూ.40 వేలు ఇస్తున్నారు.



ఆడబిడ్డలకు చేయూత

వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లి నిమిత్తం చేయూతనిస్తోంది. ఇటువంటి కార్యక్రమం అమలు చేయడం గర్వకారణం. పెళ్లయిన 60 రోజుల్లోపు ఆన్‌లైన్‌లో గానీ, సచివాలయం ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. సచివాయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, వార్డు డెవలప్‌మెంట్ సెక్రెటరీ లాగిన్‌కు ఫీల్డ్ వెరిఫికేషన్ నిమిత్తం పంపుతారు. అనంతరం పెళ్లి కూతురు ఇంటిని సందర్శిస్తారు. ఆరు దశల ధ్రువీకరణ అనంతరం సోషల్ ఆడిట్ కోసం సచివాలయ నోటీసు బోర్డులో పెట్టడానికి అర్హులు. అనంతరం కలెక్టర్ ఆమోదంతో వెల్ఫేర్ కార్పొరేషన్‌లకు పంపుతాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

నాణ్యమైన పరిష్కారమే లక్ష్యం



సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీఓ గ్రంధి వెంకటేశ్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ప్రజల నుంచి 412 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గడువుకు ముందే అర్జీలను పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. వారు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ రీ-ఓపెన్ కాకూడదన్నారు.

వినతులు కొన్ని...

- మార్క్స్ మెమో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమికి బుక్కరాయసముద్రం మండల విజయభారతి డీఈడీ కళాశాల విద్యార్థినులు హేమలత, రాణి, చందుమణి, నీలావతి, జాహ్నవి, స్వాతి, వాణి, తదితరులు విన్నవించారు. 2020–2022లో డీఈడీ పూర్తి చేశామని, తమ మార్క్స్ మెమోలు ఈ నెల 10న బుక్కరాయసముద్రం పోస్టాఫీసుకు వచ్చాయన్నారు. తాము వెళ్లి అడిగితే వాటిని కళాశాల సిబ్బంది ఒకరు తీసుకెళ్లారని చెప్పారన్నారు. అయితే ఇప్పటి వరకు తమకు యాజమాన్యం మార్క్స్ మెమో ఇవ్వలేదని, న్యాయం చేయాలని కోరారు.
- ఆదరణ మాక్ సొసైటీ యాజమాన్యం తమకు రెండేళ్లయినా సొమ్మును వాపసు చేయడం లేదంటూ మదుపుదారులు బి.వి.ఎస్.శాస్త్రి విన్నవించారు. దీనిపై కేసు నమోదై యాజమాన్యం జైలులో ఉన్నారని చెప్పారు. 'ఆదరణ' ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

యూనివర్సిటీల్లో కొలువుల జాతర



- నోటిఫికేషన్ విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల్లో కొలువుల జాతర ప్రారంభమైంది. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. నిర్దేశించిన పోస్టులన్నీ భర్తీ చేస్తే బోధన పోస్టుల కొరత తీరి విద్యార్థులకు ఉన్నత విద్య దరి చేరనుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నవంబర్ 20లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్ష నిర్వహిస్తారు.

- ఎస్కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 107, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 58, ప్రొఫెసర్ పోస్టులు 32, బ్యాక్‌లాగ్ 22 పోస్టులు భర్తీ చేస్తున్నారు.
- జేఎన్‌టీయూలో 157 అసిస్టెంట్ ప్రొఫెసర్, 3 అకడమిక్ నాన్ -వెకేషన్స్ (అసిస్టెంట్ లైబ్రేరియన్/అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టులు భర్తీ చేస్తున్నారు.

జేఎన్‌టీయూలో బ్యాక్‌లాగ్ పోస్టులివీ...

- అసిస్టెంట్ ప్రొఫెసర్లు: 2 (ఈఈఈ (బీసీ–ఈ), మేథమేటిక్స్(బీసీ–ఏ)
- అకడమిక్ నాన్- వెకేషన్స్ : అసిస్టెంట్‌లైబ్రేరియన్ పోస్టు ఒకటి

రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు:

- కెమికల్ ఇంజినీరింగ్ : ఓసీ–4, బీసీ (ఏ)–1, ఎస్సీ–1
- సివిల్ ఇంజినీరింగ్ : ఓసీ–9, బీసీ(ఏ)– 2, బీసీ (బీ)–2, బీసీ (సీ)–1, బీసీ (డీ)–1, బీసీ(ఈ)–1, ఎస్సీ–4, ఎస్టీ–2, ఈడబ్ల్యూఎస్–2
- సీఎస్‌ఈ : ఓసీ–7, బీసీ(ఏ)–1, బీసీ(బీ)–1, బీసీ(డీ)–2, బీసీ(ఈ)–1, ఎస్సీ–2, ఎస్టీ–1, ఈడబ్ల్యూఎస్–2
- ఈఈఈ : ఓసీ–10, బీసీ(ఏ)–1, బీసీ(బి)–2, బీసీ(డీ)–2, బీసీ(ఈ)–1, ఎస్సీ–3, ఎస్టీ–1, ఈడబ్ల్యూఎస్–2
- ఈసీఈ : ఓసీ–7, బీసీ(ఏ)–2, బీసీ(బీ)– 3, బీసీ(డీ)– 1, ఎస్సీ–3, ఎస్టీ–2, ఈడబ్ల్యూఎస్–3
- ఫుడ్ టెక్నాలజీ : ఓసీ–1, బీసీ(డీ)–1, బీసీ(ఈ)–1, ఎస్సీ–1

హ్యుమనిటీస్:

- కెమిస్ట్రీ : ఓసీ–3, బీసీ (బీ)– 2, ఎస్సీ–1, ఈడబ్ల్యూఎస్–1
- కామర్స్: ఓసీ–1, బీసీ(ఏ)–1, ఎస్సీ– 1
- ఇంగ్లిష్ : ఓసీ–4, బీసీ(బీ)–1, బీసీ (సీ)–1, ఎస్సీ–1, ఎస్టీ–1, ఈడబ్ల్యూఎస్–1
- మేథమేటిక్స్ : ఓసీ–1, బీసీ (ఏ)–1, బీసీ(డీ)–1, బీసీ(ఈ)– 1, ఎస్సీ –1, ఈడబ్ల్యూఎస్– 1
- ఫిజిక్స్: ఓసీ–4, బీసీ(ఏ)–1, బీసీ(బీ)–1, ఎస్సీ–2, ఎస్టీ–1
- మేనేజ్‌మెంట్: ఓసీ–2, ఎస్టీ–1, ఈడబ్ల్యూఎస్– 1
- మెకానికల్ ఇంజినీరింగ్ : ఓసీ–11, బీసీ (ఏ)–2, బీసీ (బీ)–2, బీసీ (డీ)–2, బీసీ (ఈ)–1, ఎస్సీ–3, ఈడబ్ల్యూఎస్–2
- జేఎన్‌టీయూ అనంతపురంలో 7 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఇందులో సీఎస్‌ఈలో (ఓసీ)–1, ఈఈఈలో (ఎస్సీ)–1, ఈసీఈలో మూడు (ఓసీ–2, బీసీ–ఏ(1), ఫుడ్ టెక్నాలజీలో (ఓసీ)–1, మేనేజ్‌మెంట్ –1.
- అసోసియేట్ ప్రొఫెసర్లు రెగ్యులర్ 17, బ్యాక్‌లాగ్ 7 పోస్టులు భర్తీ చేస్తున్నారు.

రౌడీ మూకలపై ఉక్కుపాదం

- సాయంత్రం ప్రజల మధ్యనే పోలీసులు
- డీఐజీ అమ్మిరెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

రాయదుర్గం: రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని రౌడీమూకలపై ఉక్కుపాదం మోపామని డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి తెలిపారు. వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెంచేలా పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. సోమవారం రాత్రి రాయదుర్గం పట్టణంలోని వినాయక సర్కిల్, కణేకల్లు, బళ్లారి రోడ్లలో పోలీసు విధులను డీఐజీ తనిఖీ చేశారు. విషయం తెలియగానే డీఎస్పీ బి.శ్రీనివాసులు అర్బన్ సీఐ లక్ష్మన్నతో కలసి డీఐజీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంశాలను డీఐజీకి తెలియజేశారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోలీస్ రేంజ్ పరిధిలోని అసాంఘిక శక్తులు, రౌడీమూకల ఆటను కట్టిస్తున్నామన్నారు. ర్యాలీలు, సభలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. చట్టాలను చేతిలో తీసుకునేలా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు పోలీసులంతా రోడ్లపై ప్రజలతోనే ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీచేశామన్నారు. ప్రజలు, పోలీసుల మధ్య స్నేహబంధం మెరుగుపడాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అక్రమ మద్యం, సారా, క్రికెట్ బెట్టింగ్, గంజాయి రవాణాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. చిత్తూరు జిల్లాలో ఇటీవల కొందరు రౌడీషీటర్లపై పీడీ యాక్టు ప్రయోగించామన్నారు. మిగిలిన ప్రాంతాల్లోని వారి సత్ప్రవర్తనపై నిఘా పెంచామని తెలిపారు. రాత్రివేళల్లో గస్తీ కట్టుదిట్టం చేయడంతో పాటు మాదక ద్రవ్యాల వినియోగంతో వాటిల్లే నష్టాలపై ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు నిఘా పెంచామన్నారు.

ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి

పోలీసులు- ప్రజల మధ్య సంబంధాలు ఏర్పడితేనే నేరాల అదుపు సాధ్యమవుతుందని డీఐజీ తెలిపారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన అనంతరం డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి పెద్దపీట వేయాలన్నారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

వీఆర్‌కు నలుగురు పోలీసులు!

తాడిపత్రి అర్బన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిపై ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. తాడిపత్రి అర్బన్ ఏఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డితో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు ఓబులేసు, వెంకటేశులు, కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్‌ను సోమవారం వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ జిల్లాలోని పలు పాఠశాలల ఆకస్మిక తనిఖీలో గుర్తించిన లోపాలకు బాధ్యులను చేస్తూ ఇద్దరు టీచర్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులు, ఒక యూపీ పాఠశాల హెచ్‌ఎంకు చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం నగరం తారకరామకొట్టాలలోని వైఎస్సార్ నగరపాలక ప్రాథమిక పాఠశాల టీచరు వర్క్‌బుక్ కరెక్షన్‌లో కనబరిచిన నిర్లక్ష్యంపై టీచరు భాగ్యలక్ష్మిపై సస్పెన్షన్ వేటు వేశారు. 3, 4 తరగతులను కలిపి ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తుండడంతో ఆత్మకూరు మండలం పి.యాలేరు ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం జయమణిని సస్పెండ్ చేశారు. మిగులు టీచర్లగా ఉన్నవారిని సర్దుబాటు చేయక పోవడం, పర్యవేక్షణ లోపం కారణంగా అనంతపురం ఎంఈఓ వెంకటస్వామి, ఆత్మకూరు ఎంఈఓ నరసింహారెడ్డిలపై చార్జెస్ ఫ్రేమ్ చేశారు. టీచర్లను సమన్వయం చేసుకోవడంలో అలసత్వం ప్రదర్శించిన అనంతపురం నెహ్రూ యూపీ స్కూల్ హెచ్‌ఎం గంగాధర్‌పై కూడా చార్జెస్ ఫ్రేమ్ చేసినట్లు డీఈఓ నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

దేశాభివృద్ధికి అవినీతే అవరోధం : డీఆర్‌ఎం

గుంతకల్లు: అవినీతి, అక్రమాల కారణంగా దేశాభివృద్ధి కుంటు పడుతోందని డీఆర్‌ఎం మనీష్ అగార్వాల్ అన్నారు. నిఘా వారోత్సవాల సందర్భంగా అవినీతి రహిత సమాజానికి పాటుపడతామని డీఆర్‌ఎం కార్యాలయ ఆవరణలో సోమవారం అధికారులు, ఉద్యోగులతో ఆయన ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల్లో అవినీతి రాజ్యమేలకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. లంచగొండితనానికి ఉద్యోగులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సూర్యనారాయణ, యు.సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

రాయదుర్గం టౌన్: పెళ్లింట విషాదం నెలకొంది. కుమారుడి వలీమా (రిసెప్షన్) రోజు తండ్రి హఠాన్మరణంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు... రాయదుర్గంలోని పాపట్ల వీధికి చెందిన సునార్ అజీజ్ సాహెబ్ (65)కు నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మూడో కుమారుడు యూనస్‌కు రాయదుర్గం మండలం డి.కొండాపురం గ్రామానికి చెందిన యువతితో ఆదివారం నిఖా జరిగింది. ఈ క్రమంలో రాయదుర్గంలోని షాదీఖానాలో సోమవారం వలీమా కార్యక్రమాన్ని పెళ్లి కొడుకు తరఫు వారు ఏర్పాటు చేశారు. కుమారుడి నిఖాలో సంతోషంగా, ఆరోగ్యంగా తిరుగాడిన అజీజ్ సాహెబ్ సోమవారం ఉదయం 11 గంటలకు షాదీఖానాలో ఉన్నఫళంగా కుప్పకూలాడు. కుటుంబసభ్యులు చూస్తుండగానే ఆయన కన్నుమూశారు. ఘటనతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. సోమవారం రాత్రి ఆయన అంత్యక్రియలను నిర్వహించారు.

ఎం-ఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)పరిధిలో ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నిర్వహించిన ఎం-ఫార్మసీ నాలుగో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, నాలుగో సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ, ప్రీ పీహెచ్‌డీ (వింటర్ సెషన్) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

చూడచెక్కని సంకల్పం

ఆయన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసి రిటైరయ్యారు. సొంతూరిలో ఏదో పని చేసే క్రమంలో కార్పెంటింగ్‌పై ఆసక్తి మళ్లింది. చిన్న చిన్న వస్తువులు తయారు చేయడం ప్రారంభించారు. అలా మొదలైన ఆయన అలవాటు.. నేడు చూడచక్కని కళాఖండాలు సృష్టించే దశకు చేరుకుంది. మనం వృథాగా పడేసే వస్తువులు సైతం ఆయన చేతిలో పడితే అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నాయి.

- వృథా వస్తువులకు జీవం పోస్తున్న ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి
- రిటైరయ్యాక సమాజానికి అవిశ్రాంత సేవలు
- పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తున్న లక్ష్మీనారాయణ



టెంకాయ చిప్పలు, మట్టలతో తయారుచేసిన వివిధ రకాల వస్తువులు





చెక్కతో తయారు చేసిన అయోధ్య రామాలయం నమూనా



లక్ష్మీనారాయణ చెక్కతో నిర్మించుకున్న ఇల్లు

సాక్షి, అనంతపురం డెస్క్: గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన లక్ష్మీనారాయణ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో 1974 సంవత్సరంలో చేరారు. 20 ఏళ్లపాటు రాడార్ విభాగంలో సేవలందించి 1994లో ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్డ్ అయ్యాక కొంతకాలం కలప వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే ఆయనకు చెక్క ముక్కలతో వస్తువులు చేసే కళ అబ్బింది. వృథాగా పడేసే చెక్కలతో సైతం మంచి కళాకృతులు రూపొందించారు. టెంకాయ చిప్పలు, మట్టలతో ఆయన తయారుచేసిన అలంకరణ వస్తువులు, చీనీ చెట్టు మొదలుతో రూపొందించిన కంప్యూటర్ టేబుల్, యుద్ధ విమానాల మోడల్స్, చెక్క ఉయ్యాల తదితర వాటిని చూస్తే ఎవరైనా ఔరా అనాల్సిందే!

అద్భుతం.. అయోధ్య ఆలయ నమూనా

గత ఏడాది డిసెంబర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీనారాయణ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యను సందర్శించారు. అక్కడ జరుగుతున్న రామాలయ నిర్మాణ పనులు, నమూనాను తిలకించారు. ఈ క్రమంలోనే 90 ఏళ్ల పైబడిన తన తల్లి ఈ ఆలయం ఎప్పుడు పూర్తవుతుందో... తాను చూడగలనో లేదో అనడం లక్ష్మీనారాయణను ఆలోచనలో పడేసింది. ఇంటికి చేరుకున్నా అదే ఆలోచన. ఎలాగైనా ఆలయ నమూనా రూపొందించి తల్లిని ఆనందింపజేయాలనుకున్నారు. కొన్ని టేకు చెక్కలు సేకరించి.. రోజుకు పది గంటల చొప్పున మూడు నెలలు శ్రమించి అయోధ్య రామాలయ నమూనాను అద్భుతంగా తీర్చిదిద్దారు. తల్లికి కానుకగా అందజేశారు. రామయ్య ఆలయాన్ని చూసిన ఆనందం కంటే.. కుమారుడు తనపై కనబరిచిన ప్రేమతో ఆ తల్లి హృదయం ఉప్పొంగిపోయింది.

కం'ట్రీ హౌస్'

ఉద్యోగ విధుల్లో భాగంగా లక్ష్మీనారాయణ ఎక్కువగా మేఘాలయ, అస్సాం, కశ్మీర్ ప్రాంతాల్లో గడిపారు. అక్కడ అడవులు ఎక్కువ. మనలాగా కాంక్రీట్, ఇటుకలతో నిర్మించినట్లుగా కాకుండా చెక్కతో రూపొందించిన ఇళ్లే ఎక్కువగా ఉంటాయి. చల్లదనం ఇచ్చే అలాంటి ఇళ్లలోనే లక్ష్మీనారాయణ ఎక్కువగా నివసించారు. ప్రకృతితో మమేకమై, అడవి అందాలను ఆస్వాదిస్తూ గడిపారు. కానీ, ఉద్యోగ విరమణ పొందాక ఇంటికి చేరుకున్న ఆయనకు ఇక్కడి కాంక్రీట్ జంగిల్ చూసి ఆందోళన మొదలైంది. ఈశాన్య భారతంలో మాదిరి ఉండే చెక్క ఇల్లు నిర్మించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా కల్లూరులోని సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి ఉపక్రమించారు. కేవలం రూ.3 లక్షలతో తక్కువ సమయంలోనే రెండంతస్తుల 'చెక్క'నైన ఇల్లు నిర్మించుకున్నారు. ఇంటి చుట్టూ రకరకాల పూలు, ఆకుకూరలు, కూరగాయల మొక్కలే కాకుండా అల్లనేరేడు, మామిడి తదితర పండ్లమొక్కలు కూడా పెంచుతున్నారు. పచ్చని చెట్ల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో కనిపించే ఆ కం'ట్రీ హౌస్'ను చూసి ఆశ్చర్యపోని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు.

సమాజ సేవలోనూ ముందంజ

ఒకప్పుడు దేశ సేవలో తరించిన లక్ష్మీనారాయణ.. ప్రస్తుతం విశ్రాంత జీవనంలోనూ అవిశ్రాంత సేవ చేస్తున్నారు. వివిధ విద్యాసంస్థల్లో ఉచితంగా 'స్పోకెన్ ఇంగ్లిష్' తరగతులు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన మెటీరియల్ సొంత డబ్బుతో జిరాక్స్ చేయించి ఉచితంగా అందజేస్తున్నారు. స్వతహాగా ప్రకృతి ప్రేమికుడైన ఆయన ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణహితంగా జీవనం సాగించాలని పిలుపునిస్తున్నారు. ఆయన సేవలను మెచ్చిన అఖిలభారత తెలుగు సమాఖ్య వారు జాతీయ ఉత్తమ పౌరుడి అవార్డుతో సత్కరించారు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

రిటైర్డ్ అయ్యాక ఖాళీగా ఉండటం ఎందుకని కలప వ్యాపారం ప్రారంభించా. ఎందుకో తెలీదు గానీ వడ్రంగి పనిపై ఆసక్తి కలిగింది. అలా చెక్క వస్తువులు తయారు చేయడం ప్రారంభించా. పర్యావరణ పరిరక్షణపై అందరూ అవగాహన కలిగి ఉండాలి. అలాగే సమాజానికి సేవ చేయాలి. నేను ఖాళీ సమయాల్లో పలు స్కూళ్లలో విద్యార్థులకు పాఠాలు కూడా చెబుతున్నా.

– లక్ష్మీనారాయణ, ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ ఉద్యోగి



చెట్టు మొదలుతో తయారు చేసిన టేబుళ్లు

రైల్వే విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య



జయరాముడు (ఫైల్)

గుత్తి: జీవితంపై విరక్తితో రైల్వే విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం బేతాపల్లికి జయరాముడు (63) రైల్వేలో ట్రాక్ మ్యాన్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో సోమవారం గుత్తి జీఆర్పీ పరిధిలోని పెద్దవంక సమీపంలో రైలు కిందపడి ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. జయరాముడు ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన పల్లవి

పెద్దపప్పూరు: త్వరలో జమ్మూ,కాశ్మీరు వేదికగా జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలకు పెద్దపప్పూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పి.పల్లవి ఎంపికైంది. ఈ మేరకు ఆ పాఠశాల పీడీ రామాంజినమ్మ వెల్లడించారు. శ్రీసత్య సాయి జిల్లా చిగిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీల్లో పల్లవి బంగారు పతాకాన్ని దక్కించుకుని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు.

ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్

అనంతపురం ఎడ్యుకేషన్: వివిధ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ చేసే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అనంతపురం జిల్లాలో 43, శ్రీసత్యసాయి జిల్లాలో 32, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో అనంతపురం జిల్లాలో 3, శ్రీసత్యసాయి జిల్లాలో 3, ఎలక్ట్రీషియన్ అనంతపురంలో 4, శ్రీసత్యసాయిలో 3, వెల్డర్, పెయింటర్ ట్రేడుల్లో రెండు జిల్లాల్లోనూ ఒక్కొక్కరికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు నవంబర్ 1 నుంచి 15వ తేదీ లోపు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారానికి కార్యాలయ వేళల్లో 73828 69399, 73828 73146 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దుస్తుల కోసం వెళ్లి బంగారం చోరీ

- గుజరాత్ నుంచి అనంతకు వలస వచ్చిన హోటల్ సప్లయర్ హస్తలాఘవం
- ఒకే ఇంట రెండు సార్లు చోరీ
- చోరీ సొత్తును అప్పనంగా పంచేస్తూ వెళ్లిన నిందితుడు

అనంతపురం క్రైం: చోరీ చేసిన సొత్తును ఎవరైనా దాచుకుంటారు...లేదంటే అమ్ముకుని జల్సా చేస్తారు. తాజాగా ఓ దొంగ ఇందుకు భిన్నంగా వ్యవహరించాడు. చోరీ చేసిన సొత్తును తన వద్ద దాచుకోలేదు... అలాగని అమ్ముకోలేదు. తెలిసిన వారికి తలా కొంత పంచుకుంటూ వెళ్లాడు. అయితే ఈ కేసులో అసలు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులకు అతని వద్ద నుంచి బంగారం రికవరీ చేయడం పెద్ద తలనొప్పిగా మారింది.

ఏం జరిగిందంటే...

అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నివాసముంటున్న చంద్రశేఖరగుప్త, ఆదిశేషుగుప్త సోదరుల ఇంట్లో మూడు రోజుల క్రితం చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు.

బతుకు తెరువు కోసం వలస వచ్చి

గుజరాత్ నుంచి అనంతకు కట్టుగుడ్డలతో వలస వచ్చిన యువకుడు వినయ్ అనంతపురంలోని గుత్తి రోడ్డు సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో సప్లయర్‌గా పనిలో చేరాడు. తాను వేసుకునేందుకు దుస్తులు లేక పోవడంతో ఎక్కడైనా ఆరేసిన వాటిని కాజేయాలని పది రోజుల క్రితం రాత్రి నగర వీధుల్లో సంచరిస్తూ రెండో రోడ్డుకు చేరుకున్నాడు. అక్కడ ఓ ఇంట్లోకి ప్రవేశించి చేతికి దొరికిన కొంత డబ్బు, బంగారాన్ని అపహరించి గుట్టుచప్పుడు కాకుండా తిరిగి తాను పనిచేస్తున్న హోటల్‌కు చేరుకున్నాడు. కొట్టేసిన డబ్బు, బంగారంలో కొంత తనతో కలసి పని చేస్తున్న వారికి, హోటల్‌కు తరచూ వస్తూ బాగా పరిచయమైన వారికి పంచాడు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడ కొన్ని రోజులుండి తిరిగి సూరత్‌కు చేరుకున్నాడు.

రెండో సారి మళ్లీ అదే ఇంట్లో..

నాలుగైదు రోజుల క్రితం అనంతపురానికి తిరిగి వచ్చిన వినయ్... అంతకు ముందు తాను చోరీ చేసిన ఇంట్లోకే మూడు రోజుల క్రితం మళ్లీ తనకు తెలిసిన మార్గంలోనే లోపలకు ప్రవేశించాడు. లాకర్లలో దాచిన బంగారంతో పాటు కొంత డబ్బు, పంచలోహాల విగ్రహాలు తీసుకుని అక్కడి నుంచి బయటపడ్డాడు. దొంగలించిన బంగారాన్ని యథావిధిగా తనకు తెలిసిన వారికి పంచిపెట్టాడు. అప్పటికే అతని వ్యవహారంపై కొందరు తోటి కార్మికులు అనుమానాలు వ్యక్తం చేయడంతో అది కాస్త బయటకు పొక్కి వన్‌టౌన్ పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో తన అవసరానికి కొంత బంగారాన్ని విక్రయించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్న వినయ్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో రెండో రోడ్డులోని ఒకే ఇంట్లో రెండు పర్యాయాలు తాను చేసిన చోరీని అంగీకరించాడు. దీంతో చోరీ సొత్తును రికవరీ చేసే పనిలో పోలీసులు తలమునకలయ్యారు. పంచలోహ విగ్రహాలను వినయ్ పనిచేస్తున్న హోటల్‌లో అతనుంటున్న గది నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు


- ఎస్కేయూ వీసీ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి
- ఘనంగా ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడలు ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ క్రీడలను ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ... 4 రకాల క్రీడాపోటీల్లో 21 కళాశాలల విద్యార్థులు తలపడుతున్నట్లు వివరించారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బాస్కెట్ బాల్, పుట్‌బాల్, కబడ్డీ, బాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్కేయూ క్రీడా కార్యదర్శి ఎంవీ శ్రీనివాసన్, కళాశాల పీడీలు ఎం.జబీవుల్లా, ఎ.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల మందలింపు.. కుమారుడి ఆత్మహత్య



గోవిందరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: మద్యం తాగొద్దంటూ తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి ఎంపీటీసీ సభ్యుడు పెన్నోబులేసు కుమారుడు గోవిందరాజు (27) ద్రాక్ష పంట కోత పనిచేస్తూ జీవనం సాగించేవాడు. భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య నాలుగు నెలల గర్భిణి. మద్యానికి బానిస. ఈ క్రమంలో ఆదివారం పుల్‌గా మద్యం సేవించి ఇంటికి చేరుకున్న గోవిందరాజును తీవ్ర స్థాయిలో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన అర్ధరాత్రి ఇల్లు విడిచి ఆలమూరు రోడ్డులో ఉన్న తమ తోటకెళ్లి వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జీజీహెచ్‌కు చేరుకుని మార్చురీ వద్ద గోవిందరాజు మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై ఆరా తీసి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, కక్కలపల్లి సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, నాయకులు ధనుంజయయాదవ్ తదితరులు ఉన్నారు.

నిత్యావసరాలు అందజేస్తాం



ఎస్పీ అన్బురాజన్ కలిసిన జోగిని, బసివినులు

అనంతపురం క్రైం: రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేస్తామని జోగిని, మాతంగి, బసివినులకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ భరోసానిచ్చారు. జిల్లాలోని ఉరవకొండ, వజ్రకరూరు, గుంతకల్లు తదితర ప్రాంతాలకు చెందిన బసివిన్నిజీ ఎస్పీని సోమవారం కలిశారు. తమ సమస్యలను వివరించారు. బసివిని, జోగిని, మాతంగి సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, నాయకురాలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 151 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 151 వినతులు అందాయి. ఎస్పీ అన్బురాజన్ స్వయంగా అర్జీలు స్వీకరించి, సమస్య తీవ్రతపై బాధితులతో ఆరా తీశారు. కార్యక్రమంలో సెబ్ సీఐ ఇందిర, దిశ సీఐ చిన్న గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడిపత్రి టౌన్: స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తాడిపత్రి మార్కెట్‌యార్డ్ చైర్మన్ హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రైతుల నుంచి నేరుగా పత్తి కొనుగోళ్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. రకాన్ని బట్టి క్వింటా కనిష్టంగా రూ.6,920 నుంచి గరిష్టంగా రూ.7,020తో కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యార్డ్ కార్యదర్శి ఆనంద్, చీమలవాగుపల్లి సర్పంచ్ రామేశ్వరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే నీటి రాజకీయం

- పయ్యావులపై మాజీ ఎమ్మెల్యే విశ్వ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పయ్యావుల కేశవ్ డ్రామాలకు తెరలేపారని, నియోజకవర్గంలో ఎక్కడేగాని లేని నీటి సమస్యను ఉన్నట్లుగా చూపిస్తూ ప్రజలను పక్కదోవ పట్టించే నీచమైన కుట్రలకు పాల్పడుతున్నారని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గ ప్రజల బాగోగులను ఏ మాత్రమూ పట్టించుకోని కేశవ్‌కు ఉన్న ఫళంగా ప్రేమాభిమానాలు పుట్టుకురావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019 ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కనీస కృతజ్ఞతలు కూడా తెలపకుండా విజయవాడ, హైదరాబాద్ నగరాలకే పరిమితమైన కేశవ్ తీరుపై నియోజకవర్గ ప్రజలు ఏవగించుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితోనే మాజీ ఎమ్మెల్యేగా ఈ నాలుగున్నరేళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడూ తీరుస్తూ వస్తున్నానని గుర్తు చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది విద్యుత్, నీటి సమస్యలు తలెత్తాయని, దీనిని సాకుగా తీసుకుని కేశవ్ నీటి రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. నీటి సమస్య తలెత్తకుండా సీఎం జగన్ ఎత్తిపోతల ద్వారా గ్రామాల్లోని చెరువులను నింపినట్లు గుర్తు చేశారు. సమావేశంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బసన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచ్ మోదుపల్లి రామాంజినేయులు, ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, గాజుల చిన్న వెంకటేశులు, కురుబ గిరిబాబు, ఎంపీటీసీ తిమ్మరాజు, భీంరెడ్డి, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి



జోష్నవి(ఫైల్)

వజ్రకరూరు: పాము కాటుతో ఓ చిన్నారి మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం పందికుంటలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఎ.సురేష్, రేణుకమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె జోష్నవి (7) స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుంటూ మరుగు దొడ్డి ఎయిర్ ఎగ్జిట్ పైప్‌లోకి చేతిని పెట్టింది. ఆ సమయంలో ఏదో తనను కుట్టిందంటూ ఏడుస్తూ ఇంటికి చేరుకున్న బాలిక కాసేపటికే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే కుటుంబసభ్యులు గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బాలిక ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చిన్నారి చెయ్యి పెట్టిన పైప్‌ను బద్ధలుగొట్టి పరిశీలిస్తే అందులో ఉన్న పాము బయటపడింది. వెంటనే పామును స్థానికులు హతమార్చారు. బాధిత కుటుంబసభ్యులను ఎంఈఓ ఎర్రి స్వామి, హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు.

క్లుప్తంగా

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు



నగరపాలక సంస్థ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మేయర్ వసీం జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు, అధికారుల సమక్షంలో మేయర్ కేక్ కట్ చేశారు. మేయర్‌కు డిప్యూటీ మేయర్లు కార్పొరేటర్లు, అధికారులు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్‌ఓ సతీష్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్‌ఐ రాఘవేంద్రరెడ్డికి బొకే అందిస్తున్న నాయకులు

రాప్తాడురూరల్: ఇటుకలపల్లి ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న రాఘవేంద్రరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్‌ఐను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, కందుకూరు సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు రాగే రేవతిపెద్దప్ప, ఆకుతోటపల్లి సర్పంచ్ గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్తరెడ్డి, సోమశేఖర్, ఉప్పరపల్లి సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, చియ్యేడు ఉప సర్పంచ్ చెన్నయ్య, కృష్ణమరెడ్డిపల్లి జయచంద్రారెడ్డి, పూలకుంట భాస్కర్‌రెడ్డి, ఇటుకలపల్లి చిరంజీవి, ఆకుతోటపల్లి మాజీ సర్పంచ్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

అనంతపురం కార్పొరేషన్: ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదని, వసూళ్లు వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు. ఏళ్ల తరబడి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి, పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం తగదు



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రామాంజనేయులు

ఆత్మకూరు: విద్యను బోధించే విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎంఈఓ రామాంజనేయులు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, హాజరు శాతం తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు.

ఆత్మకూరులో విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీ



ఆత్మకూరులో విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. విద్యుత్ విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాస బాబు, విద్యుత్ డీఈ గోపి, ఏఈఓ దాసు ఆధ్వర్యంలో ఆత్మకూరులో విద్యుత్ వాడకాన్ని పరిశీలించారు. విద్యుత్ అక్రమ వినియోగంపైనా ఆరాతీశారు. హోటళ్లు, బేకరీలు, వెల్డింగ్ షాపులను తనిఖీ చేశారు. అనుమతి లేకుండా విద్యుత్ వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● పేరుకే హైవే.. సుదూర ప్రయాణం బరువే!

నేషనల్ హైవే అంటే .. వేగంగా సునాయాసంగా సుదూరం ప్రయాణించొచ్చని అనుకుంటాం.. రహదారికి ఇరువైపులా పంట పొలాలు, ఎత్తైన చెట్లు, డివైడర్ల మధ్యలో పచ్చని చెట్లతో హాయిగా, ఆహ్లాదకరంగా ఉంటుందని కోరుకుంటాం.. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నా.. బస్సులు, కార్లలో ప్రయాణిస్తున్నా.. అలసట తెలీకుండా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని చెప్పుకుంటాం.. అయితే అనంతపురం – హైదరాబాదు రహదారిపై అతుకులు, గతుకులతో అలసట ప్రయాణమవుతోంది.. అక్కడక్కడ హైవేపై గుంతలు పడ్డాయి. ఎక్కడైనా కాస్త సేదతీరుదామంటే షెల్టర్లు కూలిపోయాయి. పచ్చని చెట్లు అగ్గిపాలయ్యాయి.. నేమ్ బోర్డులు నామరూపాలు లేకుండాపోయాయి. ఇలా ఎన్నో సమస్యలున్నా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:



గార్లదిన్నె సమీపంలో నేషనల్ హైవే దుస్థితి ఇది



గార్లదిన్నె సమీపంలో శిథిలావస్థకు చేరిన షెల్టర్







పామిడి వద్ద డివైడర్ మధ్యలో కాలిపోయిన చెట్లు , టోల్ ప్లాజా దగ్గరలోనే బోర్డు దుస్థితి



గుత్తి రహదారిలో డివైడర్ల మధ్య కాలిపోయిన చెట్లు

రాప్తాడు తహసీల్దార్‌గా సి.మునివేలు



రాప్తాడు: రాప్తాడు మండల తహసీల్దార్‌గా సి.మునివేలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ నరసింహను డీటీగా నియమించారు. తహసీల్దార్ సి.మునివేలు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సేవలు అందించడంలో చర్యలు తీసుకుంటామన్నారు. నూతన తహసీల్దార్ సి.మునివేలుకు సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు: కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన ఉదయ్‌భాస్కర్ (22) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. ఈ క్రమంలో సోమవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న తల్లి నాగమణి తలుపులు తెరిచి లోపలకు వెళ్లినప్పుడు ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపించింది. మృతుడి తండ్రి దేవదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా వాల్మీకి జయంతి

కనగానపల్లి: మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. స్థానిక మార్కెట్ సర్కిల్లో ఉన్న వాల్మీకి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వాల్మీకుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వందలాది మంది మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వాల్మీకి సంఘం నాయకులు, పలు గ్రామాల నుంచి వాల్మీకి సంఘం నాయకులు, కులపెద్దలు పాల్గొన్నారు.

పెద్దకొండాపురంలో..

రామగిరి: మండలంలోని పెద్దకొండాపురంలో వాల్మీకి జయంతి వేడుకలను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వీధుల గుండా బోనాలు మోసుకెళ్లి వాల్మీకి మహర్షికి సమర్పించారు.

వలంటీర్ కుటుంబాలకు అండగా ఉంటాం



వలంటీర్ కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: వలంటీర్ల కుటుంబాలకు అండగా ఉంటామని రాప్తాడు ఎంఎల్ఏ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్న గొల్లరాజేష్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.2 లక్షలు అందించారు. గత నెలలో మరో వలంటీర్ శశికళ భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బాధితురాలికి రూ.లక్షను అందించారు. అదేగ్రామంలో రజిని అనే మహిళ భర్త కొన్నాళ్ల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఓదార్చి వారికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. రామగిరి గ్రామంలో పెద్దమ్మ ఆలయానికి రూ.50 వేలు విరాళంగా అందించారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, అధికారులకు వారథులుగా వలంటీర్లు చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ మీనుగ నాగరాజు నాయకులు రామాంజనేయులు, ఓబిరెడ్డి, కోనంకి ముత్యాలు, శ్రీరాంనాయక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

17న మహిళా సమాఖ్య మహాసభలు

అనంతపురం అర్బన్: ఏపీ రాష్ట్ర మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలకు పెద్ద ఎత్తున మహిళలు తరలిరావాలని సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. పద్మావతి మాట్లాడుతూ నవంబరు 17న నంద్యాలలో మూడు రోజుల పాటు మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న దాదాపు 5 వేల మంది మహిళలతో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. 18, 19 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పార్వతీప్రసాద్, నాయకురాళ్లు కమ్మక్క, జానకి, యశోధ, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో 12 మందికి అస్వస్థత

అనంతపురం మెడికల్: అనంతపురం రూరల్ పరిధిలోని నందమూరి నగర్‌లో ఓ వివాహ వేడుకలో ఫుడ్ పాయిజన్ అయ్యి, 12 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఏడుగురు చిన్నారులు కూడా ఉన్నారు. మధ్యాహ్న సమయంలో భోజనం తిన్న కొద్దిసేపటికే వారు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

పంటలకు నీరు ఇవ్వాలని సీఎంకు వినతి

అనంతపురం అర్బన్: హెచ్ఎల్‌సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువల కింద సాగు చేసిన పంటలకు సాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రైతుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు పంపించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో సంఘాల నాయకులు బాలరంగయ్య, మధుసూదన్, రంగారెడ్డి, విరూపాక్షి, పోతులయ్య, శివ, భీమేష్, నాగమణి, వన్నూరప్ప, పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

అనంతపురం: కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో నవంబర్ 8న విద్యా సంస్థల రాష్ట్ర బంద్ ఉంటుంది పీడీఎస్‌యూ నాయకులు అశోక్ కుమార్, సంజీవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు వినతిపత్రం అందించారు.

కళాకారులను ప్రోత్సహించడం ఆనందదాయకం

అనంతపురం కల్చరల్: రంగస్థల కళాకారులను ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమని నాటక సమాజ నిర్వాహకులు మైఖేల్‌బాబు అన్నారు. ఏపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'జగనన్న జయకేతనం' పేరిట జిల్లాలోని పలు గ్రామాల్లో సాగిన పౌరాణిక నాటక ఘట్టాల ప్రదర్శన సోమవారంతో ముగిశాయి. అనంతపురం నగర శివారులోని కళాకారుల కాలనీలో సప్తమాంకాలు పేరిట బాలనాగమ్మ, పాన్పుసీను, సుభద్ర రాయభారం, హరిశ్చంద్ర కాటిసీను నాటకాలను ప్రదర్శించారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

బుక్కరాయసముద్రం: పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జంతలూరు సమీపంలో ఉన్న 14వ ఏపీఎస్పీ పోలీసు బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంసస్మరణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఆర్‌ఐలు లోకేశ్వర నాయుడు, సీతారామారావు, ఆర్ ఎస్‌ఐలు బెటాలియన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెడ్డిపల్లి కేవీకే, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రబీలో మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉంటుందన్నారు.



గంధం ఉత్సవంలో పాల్గొన్న మతపెద్దలు

● భక్తిశ్రద్ధలతో గంధం ఉత్సవం

అనంతపురం కల్చరల్: బీబీ ఖాసీంబీ ఖాదిరి సాహెబా గంధం ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మహదేవ్‌నగర్‌లోని హజరత్ షేక్ సయ్యద్ పీరో ముర్షిద్ మహమ్మద్ వలీసా ఖాదిరీ దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. కోర్కెలు తీర్చే రొట్టెల పండుగగా ప్రసిద్ధి చెందడంతో భక్తులు వివిధ రకాల రొట్టెలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా కమిటీ ప్రతినిధి సద్గురువు షేక్ సయ్యద్ మహ్మద్ వలీషా ఖాదిరీ నేతృత్వంలో ఊరేగింపుగా గంధాన్ని తీసుకెళ్లి ప్రత్యేక దువాతో భక్తులకు వితరణ చేశారు. పెద్ద ఎత్తున గంధం ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్న సదుపాయాన్ని కలిగించారు. రాత్రి హైదరాబాద్‌కు చెందిన గాయనీ గాయకులతో ఖవ్వాలీ కార్యక్రమం జరిగింది.

జనహితమే సీఎం సంకల్పం

● ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వైద్యసేవలపై వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: జనహితమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాతూరు, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో జరిగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 64 రకాల పరీక్షలు, 172 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్న విషయానికీ పెద్దాస్పత్రికి వెళ్లాల్సిన పనిలేదని, ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

1,30,000 మందికి వైద్య సేవలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గత నెల 30 నుంచి ప్రారంభించారని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన శిబిరాల ద్వారా 1,30,000 మంది వైద్య సేవలు పొందారన్నారు. వారిలో 30 వేల మందికి శస్త్ర చికిత్సలుఅవసరమని వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

ఓర్వలేక సీఎం జగన్‌పై విమర్శలు..

ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో విశేష ఆదరణ వస్తుండడంతో ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. చంద్రబాబు హయాంలో చేసిన స్కాంలు బయటపడి, జైలుకు వెళ్తే, ఆయన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు వ్యవస్థలను అధికార పార్టీ మేనేజ్ చేస్తోందని దిగుజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీదేవి, చింతకుంట సుశీలమ్మ, నాయకులు తిరుపాల్‌రెడ్డి, సుబ్బయ్య, చింతకుంట మధు, రఫి పాల్గొన్నారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: కర్నూలులోని రావూరి గార్డెన్స్ వేదికగా నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకూ జరిగే రొయ్యలు, చేపల ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి మత్స్యశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆ శాఖ అధికారులతో కలసి సోమవారం ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి బాబూనాయక్, జెడ్పీ ఉద్యోగులు షేక్ రఫీ, ఫణిశేఖర్‌రెడ్డి, శిరీష పాల్గొన్నారు.

అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన అండర్-17 బాలుర ఫుట్‌బాల్ జట్టు

అనంతపురం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అండర్-17 జిల్లా బాలుర జట్టు ఎంపిక ప్రక్రియను సోమవారం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. మొత్తం 400 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో దినేష్, తన్మిత్ సాయి, సంపత్, ఎం.అరవింద్, సాగర్, ఉదయ్‌కుమార్, రిషితేజ, వరుణ్ తేజ్, ఎస్.సంతోష్ సాయి, అభినయ్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీవికాస్, సాయిచరణ్, చిదానందసాయి, జి.అరవింద్, సిద్ధిక్, పవన్ ఉన్నారు. ఈ ప్రక్రియను ఉభయ జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బి.సుగుణమ్మ, అంజన్న, జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్. నాగరాజు పర్యవేక్షించారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



పోలీసుల త్యాగాలపై గీతాలు ఆలపిస్తున్న దృశ్యం



వారోత్సవంలో పాల్గొన్న పోలీసు అధికారులు

అనంతపురం క్రైం: నగరంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. సోమవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శన నిర్వహించాయి. పోలీసుల త్యాగాలు స్మరించుకుంటూ వాయిద్య బృందాలు గీతాలు ఆలపించాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, హనుమంతు, 14వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, సీఐ రెడ్డెప్ప, ట్రాఫిక్ సీఐ సీఐలు మోహన్, వెంకటేష్ నాయక్, శేఖర్, ఆర్‌ఐలు హరికృష్ణ, లోకేశ్వరనాయుడు, రామారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, ఆర్‌ఎస్‌ఐలు, 14 బెటాలియన్ వాయిద్య బృందం పాల్గొన్నారు.

రాప్తాడు: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. సోమవారం ఉదయం పోలీసు అమరవీరులకు సంఘీభావంగా ఎస్‌ఐ ఆధ్వర్యంలో ప్రజలు, విద్యార్థులు, వాకర్సు, పోలీస్ సిబ్బందితో పోలీస్ స్టేషన్ నుంచి గంగలకుంట రహదారి వరకు 2కే రన్ నిర్వహించారు. ఏఎస్‌ఐ సునీల్, సిబ్బంది భాస్కర్, అజాద్, నవీన్, మాధవ్‌నాయుడు, అంజన్ కుమార్, ఆనంద్, తిప్పేస్వామి పాల్గొన్నారు.



రాప్తాడులో పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో తిరుపతి వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సోమవారం పూర్తయింది. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న గిరిష్ స్విమ్మింగ్ పూల్‌లో చేపట్టిన ఈ ప్రక్రియకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఫ్రీ స్టైల్ విభాగంలో సి.విజయసింహారెడ్డి, ఎస్.శీను, సి.కేశవ్, సి.యోగానంద (ఏపీఎంఎస్, గార్లదిన్నె), వి.మధుసూదనాచారి, టి.నవీన్‌కుమార్, ఆర్.హేమంత్, వై.అనీష్‌రెడ్డి (జెడ్పీహెచ్ఎస్, మర్తాడు) ఎంపికయ్యారు. అలాగే బ్యాక్ స్ట్రోక్ విభాగంలో డి.బహద్దూర్, వి.కృష్ణ, డి.రామ్‌చరణ్ (జెడ్పీహెచ్ఎస్, మర్తాడు), ఎం.బన్ని, కె.తేజ, టి.చరణ్‌దాస్, బి.సిద్ధార్థ, బి.రాజశేఖర్ (ఏపీఎంఎస్, గార్లదిన్నె), డి.ప్రవీణ్ (జెడ్పీహెచ్ఎస్, కొర్రపాడు) ఎంపికయ్యారు. ఎంపికలను ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.లక్ష్మీనారాయణ, పీడీలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: గొర్రెలు, మేకల పెంపకందారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య అన్నారు. సోమవరం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సంఘం రాష్ట్ర సదస్సు పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13న డోన్‌లో గొర్రెలు, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు హరికృష్ణ, నాగప్ప, గోవిందరాజులు, రామకృష్ణ, జానకి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం ఆర్డీఓ ఎదుట పేకాటరాయుళ్ల హాజరు

అనంతపురం క్రైం: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని 14 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరిపైనా సోమవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. అనంతరం 14 మంది పేకాటరాయుళ్లను కళ్యాణదుర్గం ఆర్డీఓ ఎదుట హాజరుపరిచారు. ఏడాది కాలంపాటు వీరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేందుకు ఆర్డీఓ చర్యలు తీసుకున్నారు. ఒక్కొక్కరితో రూ.2 లక్షలు ష్యూరిటీ బాండ్లు తీసుకొని పంపేశారు. ఇకపై వాయిదాలకు తిరగాల్సి ఉంటుందని సీఐ రెడ్డెప్ప తెలిపారు. తిరిగి పేకాట, మట్కాలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి పట్టుబడితే రూ. 2 లక్షలు చెల్లించక తప్పదన్నారు.



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

**పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.**

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.



పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామ ఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషా పరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు. మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేటెడ్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

సాగుబడి

స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్ల, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు
5 రోజుల వయసులో పిల్ల పురుగులు
గ్రాములో 3 వేల పిల్ల పురుగులు
కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం
ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం
15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్ల, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయటం కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్ల, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్